# సూర్నాయణ

ఊడలు దిగిన పెద్ద మర్రిచెట్టు ఎదురుగా ఉంది ఆ షాపు. షాపు దగ్గరికి వచ్చాడు నరసయ్య. అది ఒక చిన్న గది. బయట ఉన్న సిమెంటు అరుగుమీద రిపైరుకు వచ్చిన టైర్లు ఒక పక్కగా పేర్చబడి ఉన్నాయి. కొట్లో ఇద్దరు కుర్రాళ్లు... సమవయస్కులు ఉన్నారు. షాపు బయట ఒక నులక కుక్కిమంచం ఉంది. ఒక కుర్చీకూడా ఉంది, పాతది. ఇనుముది. ఒక కుర్రాడు నులకమంచంలో మేను వాల్చాడు. వాడి మొహం కోలగా ఉంది. ఏదో హిందీ సినిమా పాటని కూనిరాగాలు తీస్తున్నాడు. మంచానికి దగ్గరగా సిమెంటు చప్టామీద కూర్చుని రిపైరుకి వచ్చిన టైరొకటి బాగుచేస్తున్నాడు రెండోవాడు. వాడి మొహం గుండ్రంగా ఉంది. ఇద్దరినీ చూస్తున్నాడు నరసయ్య.

''ఇద్దరిలో ఒకడు, ఎవడయితేనేం కులంవాడు కావాల. రెక్కల్లో సత్తువ, మనిషిలో హుషారు ఉండాల. సీతిని సుఖపెట్టాల'' అనుకున్నాడు.

''రామయ్య లేడా?'' అనడిగాడు అరుగు చివర కూర్చుంటూ.

''బజారెళ్ళాడు, బియ్యం కొనడానికి'' అన్నాడు కోలమొహం వాడు.

మాటల్లో దింపుదామనుకుంటుంటే స్కూటర్ నడిపించుకుంటూ ఒక బాబు వచ్చాడు. టెరిలిన్ పాంటు, షర్ట్ తొడుక్కున్నాడు. చేతికి పెద్ద రిస్టువాచి, కళ్ళకి జోడు. ఆరోగ్యంగా, అందంగా ఉన్నాడు. అతడి పక్కనే ఉంది ఒక అమ్మాయి. ఆ అమ్మాయికూడా మంచి ఖరీదైన గుడ్డలు కట్టుకుని ఆరోగ్యంగా అందంగా ఉంది. ఇద్దరూ నడుచుకుంటూ, స్కూటర్ని నడిపించుకుంటూ వచ్చి దుకాణం ముందు ఆగారు.

''పంచరయిందేమో చూడు'' అన్నాడా యువకుడు.

కోలమొహంవాడు కదలలేదు.

గుండ్రమొహంవాడు తలెత్తకుండా తన పని తను చేసుకుపోవటం ఒక అరనిముషం చూశాక మెల్లగా లేచివచ్చాడు.

''ఐదు నిముసాలు కూచుంటే సాలు. ఎవడో ఒకడు దిగబడతాడు'' సణుక్కుంటూ స్కూటర్ దగ్గరికెళ్ళాడు. వెనక టైరు చప్పగా అణిగిపోయి ఉంది, గాలిపోయి. రెంచి, పటకార్లు తెచ్చి పనికి ఉపక్రమించాడు. టైరు ఊడి రావటంలేదు. అడ్డుపడుతోంది ఎక్కడో. పది నిముషాలు గడిచాయి. నరసయ్య కోలమొహంవాడిని, ఆ బాబుని, అమ్మాయిని చూస్తున్నాడు. ఆ అమ్మాయి పెద్ద పెద్ద పువ్వులచీర కట్టుకుంది. భుజంమీద నిలవకుండా మెత్తగా జారిపోతుంటే పైకి తోసుకుంటోంది పమిట.

''నువ్వు నిలబడలేవు కూర్చో'' అన్నాడు యువకుడు కుర్చీ చూపించి.

నవ్వి కూర్చుంది ఆ అమ్మాయి. చక్కని చుక్కలాగుంది. చెయ్యి కదిపినా చూపు తిప్పినా చూడబుద్దేస్తోంది.

''ఇట్లాగుండాలి సీతీ, వాడు. దాని మొగుడు దాన్ని ఇట్టాగే సూసుకోవాల. సుకపడటం తెలీదు దానికి. పొద్దుగూకులా చాకిరీ చేస్తూనే ఉంటాది. లేపోతే బట్టలుతుకుతాం అంటాది. దానికెప్పుడూ బతుకుచింతే...'' నరసయ్యలో ఆలోచనలు సాగుతున్నాయి.

''ఇంకా ఎంతసేపురా! ఏమిటాలస్యం'' గుండ్ర మొహంవాడు ఒక క్షణం తన పని ఆపి అడిగాడు.

''దీన్దుంప తెగ...'' అన్నాడు కోలమొహంవాడు పళ్ళు బిగించి.

లాగాడు, పీకాడు. మళ్ళీ తంటాలు పడ్డాడు. వచ్చేసింది.

దాన్ని లోపలికి తీసుకెళ్ళాడు. పెద్ద మేకు గుచ్చుకుని ట్యూబు పంచరయింది. రెండంగుళాల మేకు లాగి చూపించాడు.

''అబ్బా'' అంది ఆ అమ్మాయి కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

ఆ కళ్ళలోకి చూస్తూ ఆ బాబు నవ్వాడు.

''ఎంచక్కా ఉన్నారు. సిలకా గోరింకల్లాగ. మొగుడూ పెళ్ళామంటే అట్లాగుండాల. కళ్ళలోకి సూసుకోని నవ్వుకోవాల'' అనుకున్నాడు నరసయ్య.

అతడి కళ్ళు మళ్ళీ ఆతృతగా కుర్రాళ్ళమీదికి మళ్ళాయి.

''ఇది లాబంలేదు బాబూ. పంచరవదు. కొత్త టైరు తేవాల - ఐతే స్టెప్నీ బిగించేస్తాను'' అన్నాడు కోలమొహం వాడు.

అది జాగాలో ఇమడలేదు.

గుండ్రమొహంవాడు లేచి వచ్చాడు. టైరులో గాలి తగ్గించాడు.

అది తేలిగ్గా పట్టింది. నట్లు బిగించాడు.

''ఇవేళ ఇంక సినిమా ప్రాప్తిలేదు'' అన్నాడు బాబు.

దంపతులిద్దరూ స్కూటరెక్కి వెళ్ళిపోయారు.

కోలమొహంవాడు వెళ్ళి నులక్కుక్కిలో పడుకున్నాడు.

గుండ్రమొహంవాడు ఇంకొక టైరు ముందేసుకుని కూచున్నాడు.

''ఐతే నీ పేరేమిటి?'' అనడిగాడు నరసయ్య గుండ్రమొహంవాడిని.

కోలమొహంవాడు మెడ అటు చాచి -

''వాడి పేరు సూర్నాయణ, నా పేరు సత్తెనారాయణ'' అన్నాడు.

గుండ్రమొహంవాడు తల యెత్తకుండానే, పని ఆపకుండానే నవ్వాడు.

''బంగారంలాంటి కుర్రాడు'' సంతోషం మనసులో ఉరకలు వేస్తుంటే నరసయ్య అనుకున్నాడు.

''పని ధ్యాస, చేతుల్లో సత్తువ, బుద్ధి కుదురు ఉంటే ఇంట్లో లక్ష్మి చిందులు వేస్తుంది. సీతికిలాగే వీడికీ పని ధ్యాస. మొగుడు సంపాదిస్తేనేనా కూర్చుంటుందేమో సీతి! కోలమొహంవాడు.. సత్తెనారాయణ కాబోలు... సూట్టానికి బాగుండాడు. కానీ సోమరిపోతు భార్యాబిడ్డలకి కూడెట్టా పెడతాడు!'' నరసయ్య కోలమొహంవాడిని నిరసనగా చూశాడు.

''ఓ మెరెరాజా... కపానవోన....'' కోలమొహంవాడు సన్నగా రాగాలు తీస్తున్నాడు.

''రామయ్య నీకేమవుతాడు?'' గుండ్రమొహంవాడిని అడిగాడు నరసయ్య.

వాడు తలయెత్తి నరసయ్యని చూస్తున్నాడు.

కోలమొహంవాడు మెడ అటువైపు తిప్పి -

''ఏమవుతాడా! మాకు పెంపుడు తండ్రి, ఈ షాపు ఈ టైర్లు, ఈ మర్రిచెట్టుకి మేం వారసులం. ఇక్కడ నీకేవిటి పని!'' అన్నాడు.

రయ్యిమని స్కూటరు వచ్చేసింది. ఆ బాబు స్కూటర్ దిగి కోల మొహంవాడిని పిలిచాడు.

''ఐదు నిముషాల్లో తెచ్చేసాడు. ఇక్కడంతా ములిగిపోయినట్టు ఏటా తొందర.... పని... పని... ప్రాణం పోతోంది'' కోల మొహం సణుక్కుంటూ

మెల్లగా లేచాడు. ట్యూబులో గాలి ఎక్కించాడు. టైరు బిగించడానికి ప్రయత్నించాడు. మళ్లీ అది మొరాయించింది.

''వీడు లాభం లేదు. సత్తెనారాయణ లాభం లేదు. సూర్నాయణే ఖాయం'' అనేసుకున్నాడు నరసయ్య.

వీధి మొదట్లో ఎవరో స్కూటర్ నడిపించుకుంటూ వస్తున్నారు.

''ఇంకో పంచరొస్తోంది'' అన్నాడు కోలమొహంవాడు.

ఆ అమ్మాయి కిసుక్కున నవ్వింది. బాబు కూడా నవ్వి అన్నాడు.

''నీ ప్రాణానికి గండంలాగ, నీ కళ్ళకి స్కూటర్లన్నీ పంచర్లలాగ కనిపిస్తున్నాయి.''

ఆ స్కూటర్ ఆగకుండానే వెళ్ళిపోయింది దుమ్ము రేపుకుంటూ.

''అబ్బ. ఎంతసేపు'' అంది ఆ అమ్మాయి మళ్లీ.

గుండ్రమొహంవాడు లేచి వచ్చాడు. టైర్‌లో గాలి తగ్గించాడు. రెండు సుత్తి దెబ్బలు తగిలించాడు. టైర్ యధాస్థానంలో చేరింది. నట్లు స్క్రూలు బిగించేశాడు. ''........ర చెయ్యాలి'' అంటూ వెళ్ళాడు.

స్టెప్నీ బిగించాడు కోలమొహంవాడు.

ఆ బాబు రెండు రూపాయలిచ్చాడు. స్కూటర్ వెళ్లిపోయింది. డబ్బు తీసుకున్న కోలమొహంవాడి కళ్ళలో సంతోషం మెదిలింది. జేబులో పెట్టుకునివెళ్ళి కుక్కిలో కూలబడ్డాడు.

''పనికి ముందుకి రాడు గానీ, పైసా చూస్తే ఆనందం వెధవకి!'' అనుకున్నాడు నరసయ్య.

''రామయ్య ఎప్పుడొస్తాడు?''

''రావాల. బజారెళ్ళాడు.''

''నరసయ్య వొచ్చి ఎల్లేడని సెప్పు.''

పైగుడ్డ దులిపి భుజంమీద వేసుకుని లేచాడు నరసయ్య.

''కప్పుడు 'చా'యన్నా దొరకలేదు. సెప్పి రాలేదుగదా. పిల్లాడెటువంటివాడో చూడాలనేకదా సెప్పకుండా వచ్చింది'' అనుకున్నాడు తనలో తను.

కొంచెం ముందుకు వెళ్ళేసరికి రామయ్య వస్తున్నాడు.

''కుర్రాళ్ళని చూశావా... ఒకడు అన్న కొడుకు. మరొహడు సెల్లిలి కొడుకు. నాకిద్దరూ ఒహటే. చెప్పిన్నుగదా.''

''ఆ చూశాను. అరగంట కూచుని చూశాను. సూర్నాయణకే ఇస్తాను సీతిని. ఆడు నాకు నచ్చాడు. పెళ్లి ఖాయం చెయ్యి'' అన్నాడు.

''చాయ్ తాగిపోదువుగాని రా'' అన్నాడు రామయ్య.

''పోతాను. సీతి చూస్తుంటాది'' అని ముందుకి అడుగేశాడు నరసయ్య.

* * *

ఇంటికి వచ్చేటప్పటికి సీతి పొయ్యి రాజేస్తోంది.

''ఇప్పటిదాకా ఏంజేస్తుండవ్'' అన్నాడు.

''ఇందిరమ్మగారింట్లో బియ్యం దంచాను. అర్ధరూపాయిచ్చారు.''

''ఊ. పని ధ్యాస. కూసోవు అరగడియ. ఏంసేత్తావే అర్ధరూపాయల్ని'' విసుక్కున్నాడు నరసయ్య.

''ఏదో సేత్తాను'' కాసులపేరు సేయిత్తాను. మూడంతస్తుల మేడ కట్టిత్తాను. సరేనా'' అది సీతి కిలకిల నవ్వుతూ.

''అయ్యకి ఆకలేస్తోంది గావాల. ఐదు నిముషాల్లో వండేస్తాను. ఇందిరమ్మగారు గుమ్మడికాయ పులుసు ఇచ్చింది'' అంది.

వేడి అన్నంలో పులుసు కలుపుకుంటూ,

''ఇయ్యాల పిల్లాడ్ని సూసొచ్చానే సీతీ'' అన్నాడు నరసయ్య.

''ఎవడాడూ... నీ కెప్పుడిదే ధ్యాస. నేను బరువయిపోయానా అయ్యా'' అంది సీతి.

''ఛ. అట్టగనమాకే. నీకు పెళ్లి సేత్తాను. మీ ఇద్దరూ సిలకా గోరింకల్లాగ నా ఎదుట ఉండాల. ఆడూ ఇక్కడకే వత్తాడు. ఆడు రామయ్యా కొట్లో పనిసేత్తున్నాడు. కావలసినవాడే. బుద్ధిమంతుడు. నీలాగే వాడికీ పని ధ్యాస. చేతిలో మాంచి పనివాడితనం ఉంది. నీ బదులుకూడా వాడే సంపాదిత్తాడు. నువ్వు చేతులిరక్కొట్టుకొని బియ్యం దంచితే ఊరుకునేది లేదు. వాడు సంపాదిత్తాడు. చిలకలాగ సింగారించుకుని నువ్వు వాడికి వొండిపెట్టాల. వాడి సుఖం చూడాల.''

''చాల్లే ఏసాలు. కూచోటం నేరిస్తే బువ్వెట్టా దొరుకుద్ది!''

''వాడు సంపాదిత్తాడు గదా. అందుకే మెరికలాంటి కుర్రాణ్ణి సూశాను. వాడి పేరు సూర్నాయణ. నువ్వాణ్ణి సూత్తావా? సూడాలంటే సెప్పు. ఇంటికి తెస్తాను,''

''నువ్వు రైటు సేశావుకదయ్యా. మరి నేనెందుకు సూట్టం! వొద్దు. ముకంకాదు. మనసు ముక్యం. రాత ఎట్టాగుంటే అట్టా గవుద్ది'' అంది సీతి.

''అయితే ఖాయంచేస్త. మూర్తం పెట్టేస్తా''

''ఊ'' అంది సీతి తల ఒంచుకుని.

* * *

పెళ్ళి ఏర్పాట్లతో నరసయ్యకి తీరికలేదు. సామాన్లు కొన్నాడు, చుట్టాలికి చెప్పాడు. కొట్టుకువెళ్ళి రామయ్యా చేతిలో వందరూపాయలు పెట్టాడు పెళ్ళికొడుక్కి మంచిగుడ్డలు కొనమని.

కోలమొహంవాడు రామయ్యా చేతిలో డబ్బు లాక్కుని లెక్కపెట్టాడు.

''దీనికి ఒక టెరిలిన్ సర్టు, టెర్రికాటు పేంటు వస్తాయ్'' అన్నాడు నవ్వుతూ.

''ఎదవేలాకోలం'' అనుకున్నాడు నరసయ్య, టైర్ రిపేర్ చేస్తున్న గుండ్ర ముఖంవాడిని ఆప్యాయంగా చూస్తూ.

''మావ వస్తే చూడవేందిరా. నా పెళ్ళికి నువ్వు తోడు పెళ్ళికొడుకుంటే నీ పెళ్ళికి నేనుతోడు పెళ్ళికొడుకుంట'' అన్నాడు కోలమొహంవాడు.

గుండ్రమొహంవాడు నవ్వి తల ఒంచుకున్నాడు మళ్ళీ.

* * *

సీతి పెళ్ళికూతురయింది. బాజాలు మోగుతున్నాయి. పెళ్ళికొడుక్కు ఎదురువెళ్ళేడు నరసయ్య. పెళ్లికొడుకుమీద చూపు ఆనగానే సరిగ్గా కళ్ళు కనిపిస్తున్నాయా అనుకున్నాడు నరసయ్య.

పెళ్ళికొడుకు కోలమొహంవాడు.

కోలమొహంవాడా సూర్నాయణ!

మోసం, మోసం! మోసం జరిగిపోయింది.

కళవళ పడిపోయాడు నరసయ్య. రామయ్యాని ఒక పక్కకి లాగాడు.

''వీడు కాదు, వీడు కాదు నేను ఎన్నుకుంది. నన్నెందుకు మోసం చేశావు రామయ్యా!''

''సూర్నాయణ్ణి ఖాయం చెయ్యమని నువ్వే సెప్పావుగద!''

''సెప్పాను. ఆ గుండ్రమొహంవాడు సూర్నాయణ అని. తన పేరు సత్తెనారాయణ అని వీడే చెప్పాడు.''

''వీడే సూర్నాయణ. వీడికి హాస్యమాడ్డం అలవాటు. ఏలాకోలం ఆడేడు కాబోలు.''

''బతుకుతోటి ఏలాకోలమేంటి? ఈ పెళ్ళి జరగదు. వీల్లేదు.''

''బగమంతుడి తీర్పు ఇట్టాగుంది నరసయ్యా. వాడికీ ఏంటో తెలవదు. ఎందుకు గలభా సేత్తావు. నాకు ఇద్దరూ ఒకటే. సమానమే''

''నీకు సమానమేగానీ వీడు సోమరిపోతు. కూకుంటే నెగవడు. నేను సూశానులే.''

''దానికేటుంది, సరదా మనిషి. ఈడూ పనిచేస్తున్నాడు, సంపాదిస్తున్నాడు. దేవుడు అట్టా రాశాడనుకోవాల. లేకపోతే ఆరోజు నువ్వు రావటం, నేను లేకపోవటం, ఆడు ఏలాకోలం ఆడ్డం ఏంటిదంతా? అనవసరంగ పిల్లదానికి సెప్పి దాని మనసు పాడు సెయ్యకు'' అన్నాడు రామయ్యా.

నరసయ్యా చప్పగా చల్లారిపోయాడు. పెళ్ళికూతుర్రై కళకళ లాడుతున్న సీతికి ఏమీ చెప్పలేకపోయాడు.

అమాయకమైన మనసులో కలత లేపటమా, ఈ సంతోషంలో గోల లేవతియ్యటమా, ఊరుకోవటమా! ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు.

సీతి నవ్వుతూ సూర్నాయణచేత మంగళసూత్రం కట్టించేసుకుంది.

''మోసం, మోసం జరిగిపోయింది'' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు నరసయ్యా.

* * *

నరసయ్యా ఇంటికొచ్చేప్పటికి సూర్నాయణ బయట చల్లగాల్లో మంచంమీద పడుకుని ఉన్నాడు.

''పచ్చగడ్డి కోసేటి పడుసుపిల్లోయ్...'' కూనిరాగాలు తీస్తున్నాడు.

''హు. అప్పుడే కొంప జేరుకున్నాడు'' అని విసుక్కున్నాడు నరసయ్యా.

''సీతేది! ఇంకా రాలేదా?'' అనడిగాడు.

''అదా, అప్పుడే వస్తుందా? ఇందిరమ్మగారి దగ్గర సదువుకూడా నేరుస్తోంది'' అన్నాడు సూర్నాయణ. వాడి చూపులు వీధిమీదికే ఉన్నాయ్.

నరసయ్యా నిట్టూర్చాడు. తాననుకున్నది ఒకటైతే - ఇలా జరిగింది. దానికే తాపత్రయమంతాను. వీడికంతా కులాసానే. బగమంతుడు ఎందుకు

ఇన్నిరకాల మడుసుల్ని పుట్టిస్తాడో! నీలాగ అదికూడ మంచం ఎక్కి వగలుబోతే ఈ బూమి తిరగటమే మానేస్తుందిరా!'' అనుకున్నాడు ఏం చెయ్యాలో తెలీని కసితో.

''నీ పయిటకొంగు జారిందే...'' పాడుతూనే ఉన్నాడు సూర్నాయణ.

సీతి వచ్చింది.

''ఇంత పొద్దొయేదాకా ఏం జేస్తుండావ్. ఆళ్లు నిన్ను కొనేసినారా!'' చేతులు తిప్పుకుంటూ అడిగాడు సూర్నాయణ.

''ఆ... అక్కడ ఆటలు ఆడుతున్నా, పాటలు పాడుతున్నా'' అంది సీతి.

''నీ మొహానికి పాట కూడాను. ఎల్లెల్లు. జిడ్డు మొహం కడుక్కురా!''

సీతి నవ్వుకుంటూ లోపలికెళ్ళింది. మొహం కడుక్కుంది. జడల్లుకుంది. సూర్నాయణ మల్లెపూలు పట్టుకుని లోపలికెళ్లాడు.

''ఏడవి మావా!''

''ఆకాశంలో ఏలాడుతున్నాయ్. ఎర్రి మొహవా!.... కొన్నాను.''

'ఉ. పదిపైసలు దండగ.''

''నువ్వు తినే తిండి దండగ కాదూ. మనం సేసే సాకిరి దండగగాదూ. దండగ కానిదేముందే. ఇల్లాగ ఆనందంగా ఉండటం తప్ప!''

సీతి నవ్వటం వినిపించింది నరసయ్యకి.

ఆ నవ్వులో తృప్తి సంతోషంకూడా వినిపించాయి.

ఏవో పొరలు విడిపోయి కొత్త విషయం అర్థం అయినట్లుగా అనిపించింది.

''నిజమేనేమొ, రామయ్య చెప్పింది! దేవుడిట్టా రాశాడు. సీతి కూడా మనసే ముఖ్యం అంది. వాడు కూచుంటాడని, తను కష్టపడుతున్నానని అనుకోదు. అవీ ఇవీ కోరుకోదు. ఏమో సత్తెనారాయణ్ణి చేసుంటే వాడు దాన్ని ఇట్టాగ నవ్వించేవాడు కాదేమో! పని, పని అంటూ రేతింబవుళ్లు ఆ కొట్లోనే ఉంటాడేమో! దేవుడి తీర్పు మనకి తెలవదుకానీ అంతా మన మంచికే అవుతుంది. సీతి అదృష్టవంతురాలే... సూర్నాయణ మంచోడే.... అనుకున్నాడు తనలో తను.

కళాసాగర్ సావెనీర్, 1977

* * * *